‘డబుల్’పై మళ్లీ సర్వే

- అధికారుల చర్యపై లబ్ధిదారుల ఆందోళన
- ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్లలో 31,651 దరఖాస్తులు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో డబుల్ బెడ్‌రూం కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి ఏళ్ల తరబడి నిరీక్షణే మిగిలింది. దరఖాస్తుల పరిశీలనకు అధికారులు గతంలో కరసత్తు చేసి లెక్కలు తేల్చినప్పటికీ జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ సర్వేను పరిగణలోకి తీసుకోక పోవడంతో మళ్లీ అధికారులు సర్వే చేయనున్నారు. ఇందు కోసం గ్రేటర్ పరిధిలోని సిబ్బంది సహాయంతో దరఖాస్తులు చేసుకున్న వారి సంఖ్య తేల్చేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. గతంలో చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు చేసిన సర్వేను పరిగణంలోకి తీసుకోకపోవడంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల దరఖాస్తుదారులకు నిరీక్షణే ఎదురౌతుండడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో సుమారుగా 31,651 మంది డబుల్‌బెడ్ రూం కోసం దరఖాస్తులు చేసి దాదాపుగా 4సంవత్సరాలు కావస్తున్నప్పటికీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎన్నికల హామీవేళ..

గత ఎన్నికల్లో ఇచ్చిన సీఎం హామీల మేరకు ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో ఇళ్లులేని వారు డబుల్‌బెడ్ రూంల కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బస్తీ వాసులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికే జోనల్ పరిధిలో నిర్మించిన నాంచారమ్మ బస్తీ, వనస్థలిపురం ప్రాంతాల్లో లబ్ధిదారులు చేరి నివాసాలు ఉంటున్నారు. వనస్థలిపురంలో నిర్మించిన వాటిలో కొన్ని ఇప్పటికి ఖాళీగా ఉన్నాయి. వీటికి తోడు శివారు ప్రాంతాల్లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలో గతంలో దరఖాస్తులు చేసుకున్న అర్హులను గుర్తించేందుకు రీ సర్వేలో భాగంగా రెవెన్యూ అధికారులు తిరిగి సర్వే చేసేందుకు సర్కిల్ కార్యాలయంలో సర్వేపై సమీక్షసమావేశం నిర్వహించి సర్వే తీరును సిబ్బందికి వివరించారు.

- డబుల్ బెడ్‌రూం ఇళ్ల దరఖాస్తులకు సంబంధించిన వివరాలను ఆయా సర్కిల్ కార్యాలయంలో ఈ సంవత్సరం జనవరి నాటికి 60శాతం వరకు అధికారులు సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించారు.జీహెచ్‌ఎంసీ అధికారులు చేసిన సర్వేలో తప్పులతడకలుగా ఉన్నట్లు భావించిన ఉన్నత అధికారులు ఆ సర్వేను పక్కన పెట్టి మరల రెవెన్యూ అధికారులు తిరిగి సర్వే చేయించడం పట్ల ఒకింత లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ ఇంకా ఎంత కాలం ఈ నిరీక్షణ అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పేదలు సొంతింటి గూడు చేరేందుకు మరింత అలస్యం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.



డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

సర్కిళ్ల వారిగా వివరాలు ఇలా...

ఎల్‌బీనగర్‌సర్కిల్–3లో 11004మంది, సర్కిల్–4లో9648మంది, సర్కిల్–5లో10763మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను త్వరలోనే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చిరునామాలో వారు ఉన్నారా?లేరా? అనే విషయంపై పరిశీలన చేయనున్నారు.

ఈద్గాను సందర్శించిన ఎమ్మెల్యే

మలక్‌పేట: బక్రీద్ పండుగను పురస్కరించుకుని మంగళవారం ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులతో కలిసి అక్బర్‌బాగ్ డివిజన్ పరిధిలోని ఉజాలే షాహ ఈద్గాను సందర్శించారు. బక్రీద్ పండుగ నాడు ఉదయం 7 గంటలకు జరుగనున్న ప్రత్యేక (నమాజ్ ఈద్–ఉల్ అధా) ప్రార్థనల ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందరర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



ఈద్గాలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ మినాజుద్దీన్

డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు



డ్రైనేజీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మెడికల్ అండ్ హెల్త్ కాలనీ, పద్మావతి కాలనీలలో డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోవడంతో కాలనీల వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.దీంతో మంగళవారం అధికారులతో కలసి కాలనీలలో పర్యటించి వెంటనే మరమ్మత్తులు చేపట్టి సమస్యల పరిష్కరించాలని అధికారులను కోరారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షకాలం దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు.ఎలాంటి సమస్య అయిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం రాజగోపాల్, మేనేజర్ సిరివెన్నెల, జీహెచ్‌ఎంసీ ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు మూర్తి, పాండు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్.....

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని అగన్వాడి కేంద్రాన్ని మంగళవారం స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరిశీలించారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపో నుంచి నడిచే బస్సు సర్వీసులకు సంబంధించిన ప్రయాణికుల సలహాలు, సూచనలు, సమస్యలు స్వీకరించేందుకు బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్‌టీసీ డీఎం కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, బీద్‌కుండ్, జూకల్, కొల్లాపూర్, విజయవాడ, బైలడిల్ల, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూరు తదితర రూట్లలో తిరిగే బస్ సర్వీసులకు సంబంధించిన పిర్యాదులు, సలహాలు తెలియజేసేందుకు 9959226249 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా రూ.75, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 75, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 15, క్యారెట్ 55, దొండ 28, ఆలు 21, ఉల్లి 17, గోకర 35, దోస 18, సొర 13, పొట్ల 23, అరటి 11, చిక్కుడు 85, అర్వి 35, మునగ 45, కీర 31, ఫ్రెంచ్ బీన్స్ 95, కాప్సికమ్ 60. ఈధరలు బుధవారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. దుర్గాభవానీనగర్, మాదన్నపేట 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఐఎస్‌సదన్, డీఎస్‌నగర్, సెంట్రల్ ఎక్స్చేంజ్, ఈస్ట్ మారుతీనగర్, యాదగిరి నగర్, దుర్గాభవానీనగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక



ఎన్టీఆర్‌నగర్ ముదిరాజ్ సంఘం నూతన కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్టీఆర్‌నగర్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సరికొండ ఎల్లం ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా గువ్వ శ్రీనివాస్, కట్ట వెంకటేష్, పులకరం శ్రీనయ్య, ప్రధాన కార్యదర్శిగా గంగనబోయిన వెంకటేష్, కార్యదర్శులుగా ఈర్ల ఎల్లయ్య, బొమ్మకంటి రాములు, కాకనమోని విజయ్ గోపాల్, కోశాధికారి దివిటి వెంకటేష్ ఎన్నికయ్యారు.

వెబ్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ

చైతన్యపురి: డీగ్రీ, బీటెక్, ఎంసీఎ, పీజీ చదువుకొని ఉన్న నిరుద్యోగ యువతకు నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లో వెబ్ డెవలపర్ కొర్సులో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8008088392, 9154289331 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

చంచల్‌గూడ పాఠశాలలో పఠనోత్సవం



చంచల్‌గూడ: పిల్లలకు చదవడం అలవాటు చేసేందుకు పఠనోత్సవ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ నెహ్రూ బాబు తెలిపారు. మంగళవారం ఆయన చంచల్‌గూడలోని కాలేడేరా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పఠనోత్సవ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 31 వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ప్రతి రోజూ ఒక గంట లైబ్రరీలో పుస్తక పఠనం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిని పట్టించుకోని సైదాబాద్ కార్పొరేటర్

సైదాబాద్: సొంత పార్టీ కార్యాక్రమాలకే పరిమితమవుతున్న సైదాబాద్ బీజేపీ కార్పొరేటర్ డివిజన్ పరిధిలో అభివృద్ధిని మాత్రం పట్టించుకోవడం లేదని డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. మంగళవారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేటర్‌గా గెలిచిన గడిచిన రెండున్నర ఏళ్లలో డివిజన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ నిధులతో చేపట్టిన ఒక్క అభివృద్ధి పనిని చూపించగలరా అని ఆయన కార్పొరేటర్‌ను ప్రశ్నించారు.

అనుమతి లేకుండా రోడ్డు తవ్వితే చర్యలు



రోడ్డును పునరుద్ధరణ చేయిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి

మన్సూరాబాద్: కాలనీలకు అనుసంధానంగా ఉన్న రోడ్లను సొంత నిర్ణయాలతో తవ్వవద్దని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి కోరారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి ఎల్లారెడ్డి కాలనీ నుంచి కేవిఎన్‌రెడ్డికాలనీ వరకు ఉన్న అనుసంధానంగా ఉన్న రోడ్డును శ్రీరామ్‌నగర్‌కాలనీ వాసులు తవ్వారు. సమీప కాలనీలకు లింక్ రోడ్డు లేకపోవడం ఆయా కాలనీలవాసులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి వరదనీటి పైపులు వేయించి లింక్ రోడ్డును పునరుద్ధరణ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కొంత మంది తమ సొంత ప్రయోజనాల కోసం లింక్ రోడ్డును నిర్బంధం చేశారని, మరోసారి రోడ్డును తవ్వితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రమోద్, ప్రశాంత్, జానయ్య పాల్గొన్నారు.

సైదాబాద్‌లో ఉద్రిక్తత

- ఆలయ ప్రహరీ, పూజారి గది కూల్చివేత
- అధికారుల సమన్వయలోపమే కారణం

సైదాబాద్: ప్రభుత్వశాఖల అధికారుల సమన్వయ లోపం సైదాబాద్‌లో ఉద్రిక్తతకు దారి తీసింది. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా సైదాబాద్ ప్రధానరహదారిపై ఉన్న హనుమాన్ దేవాలయ ప్రహరీని జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చారు. దీంతో భక్తులు, పలుపార్టీల నాయకులు ఆలయం వద్దకు పెద్దసంఖ్యలో చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక కార్పొరేటర్, పలువురు నాయకులు విషయం తెలుసుకునేందుకు పలువురు అధికారులను సంప్రదించినా పొంతన లేని సమాధానం ఇవ్వడం, తమకు తెలియదంటూ తప్పించుకోవడం గందరగోళానికి దారి తీసింది. జీహెచ్‌ఎంసీ అధికారుల తీరుపై ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీకి ఫిర్యాదు చేశారు. న్యాయస్థానం ఉత్తర్వులు ధిక్కరించి కూల్చివేతలు చేపట్టిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, నాయకులు సౌత్‌జోన్ డీసీపీ రూపేష్‌కు ఫిర్యాదు చేసారు.

ఘనంగా అరవింద్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



అరవింద్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘ నాయకులు

లింగోజిగూడ: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం రాత్రి ఎస్‌కేడీనగర్‌లోని తన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీల సంక్షేమ సంఘ నాయకులు అరవింద్‌రెడ్డి నివాసానికి చేరుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ముప్వ సతీష్ చౌదరి అరవింద్‌రెడ్డిని ఘనంగా సన్మానించి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన రక్తదాన, ఐ డొనేషన్ క్యాంప్‌లో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని రక్తదానం చేశారు. కళ్ల దానానికి సంబంధించి సంతకాలు చేశారు.

రోడ్లపై పారుతున్న మంచినీరు



మంచినీటి పైపు లైన్ వాల్వ్ పగిలిపోయిన దృశ్యం

హస్తినాపురం: మంచినీటి పైపులైన్ పగిలిపోయి మంచినీరు రోడ్లపై వృధాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వెంటనే పగిలిపోయిన పైపులైన్లకు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణకాలనీ రోడ్ నంబర్ 7లో మిషన్ భగీరథ పైపులైన్ కంట్రోల్ వాల్ దగ్గర కనెక్షన్ తొలగిపోవడంతో నీరు వృధాగా పోతోంది. నాలుగు రోజులుగా రోడ్డుపై మంచినీరు ప్రవహిస్తున్నా ఎవరూ పట్టించుకోక పోవడంతో వాటర్ వర్క్స్ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పైపులను కనీసం రెండు అడుగులు కూడా భూమిలోపలికి వేయకపోవడం మూలంగానే పైపులు పగులుతున్నాయని, కేవలం ఒక్క అడుగులోతులో పైపులు వేయడంతోనే ఈ సమస్యలు వస్తున్నాయని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తిరిగి సమస్యలు తలెత్తకుండా పైపులైన్లకు మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మంచినీరు పైపులైన్ లీకై వృధాగా పోతున్న నీరు

కేంద్ర పథకాలపై ప్రచారం

చంచల్‌గూడ: పీఎం మోదీ ప్రవేశపెట్టిన పథకాలతో అన్ని వర్గాల వారు లబ్దిపొందుతున్నారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ కె. సహదేవ్‌యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలో సంపర్క్ అభియాన్‌లో భాగంగా మహిళల ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధి అంటే ఏంటో గత 9 సంఎత్సరాల్లో మోదీ చూపించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకంలో కేంద్రం వాటా ఉందన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న కేంద్ర పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్ రెడ్డి, నాయకులు జనపాల మధు పాల్గొన్నారు.



కుర్మగూడలో కేంద్ర పథకాల గురించి ప్రచారం చేస్తున్న నాయకులు

పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు



అనుపమనగర్‌లో పాదయాత్ర చేస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: కేంద్రప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టి వాటిని పకడ్బందీగా అమలు చేస్తోందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపి అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనుపమానగర్ కాలనీలో మహా సంపర్క్ అభియాన్ యాత్రలో బాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో కార్యకర్తలతో కలిసి రంగారెడ్డి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలను కార్యకర్తలు ప్రజలలో ప్రచారం చేయాలనిసూచించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, నాయకులు రాజేంద్రప్రసా పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తి చేయండి

హుడాకాంప్లెక్స్: అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని సరూర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ అధికారులను కోరారు. మంగళవారం డివిజన్ పరిధి పోచమ్మ బాగ్‌కాలనీలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ ఆధునీకరణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారి ప్రశాంతితో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు దయాకర్‌రెడ్డి, బాలకిషన్, సుదర్శన్ ముదిరాజ్, ఆనంద్, రాఘవేంద్రగుప్తా, కాలనీవాసులతో కలిసి యూజీడీ పైపులైన్ పనులను పరిశీలించారు. 15 రోజుల క్రితం రోడ్డును తవ్వడం వల్ల రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వెంటనే పనులు జరిగేలా చూడాలని జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రశాంతి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వారం రోజుల్లో యూజీడీ పైపులైన్‌ను పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. పోచమ్మబాగ్ కాలనీకి ఆనుకుని ఉన్న ఎస్‌వీఆర్‌ఎస్ బృందావనంలో నివాసముంటున్న 35 అపార్ట్‌మెంట్ల నుంచి డ్రైనేజీ నీరు మొత్తం మా కాలనీ గుండా ప్రవేశిస్తుందని దానికి కూడా పరిష్కారం చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

జైలు స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణం

సూపరింటెండెట్ ఫిర్యాదుతో కేసు నమోదు

సైదాబాద్: జైళ్లశాఖకు చెందిన స్థలాన్ని కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు. తమ శాఖకు చెందిన భూమి కబ్జా, అక్రమ నిర్మాణంపై చంచల్‌గూడ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదైంది. సైదాబాద్ ఏసీపీ కార్యాలయం చౌరస్తాలో తెలంగాణ జైళ్లశాఖకు చెందిన భూమి ఉంది. అయితే ఆ స్థలంలో కొంతకాలం నుండి గుర్తు తెలియని ఆక్రమణదారులు కబ్జా చేసి చట్ట విరుద్ధంగా నిర్మాణాలు సాగిస్తున్నారు. విషయాన్ని గుర్తించిన చంచల్‌గూడ జైలు సూపరెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ సోమవారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసారు. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ ఐపీసీ 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం: ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఈడీ వెంకటేశ్వర్లు

హయత్‌నగర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఒక్కరి రక్తంతో ముగ్గురు ప్రాణాలను రక్షించవచ్చని టీఎస్‌ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనర్ సూచన మేరకు మంగళవారం ఆర్టీసీ కార్మికులు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండి ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిపో మేనేజర్ రఘు, అసిస్టెంట్ మేనేజర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



శాంతికమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ జలేందర్‌రెడ్డి

హస్తినాపురం: పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని వనస్థలిపురం సీఐ దేవ జలేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో బక్రీద్ పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన శాంతికమిటీల సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయసంఘటనలకు తావులేకుండా జరుపుకోవాలని సీఐ సూచించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు పి.బల్‌రాం, వెటర్నరీ డాక్టర్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కారు ఢీ కొని ఒకరికి తీవ్రగాయాలు

నాగోలు: గుర్తు తెలియని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన మేరకు.. హయత్‌నగర్, కుంట్లూరుకు చెందిన కోట శివారెడ్డి కుంట్లూరు నుంచి ఆనంద్‌నగర్ చౌరస్తాకు తన పల్సర్ బైక్ వచ్చాడు. తిరిగి కుంట్లూరు వెళ్తుండగా తాజా టిఫిన్ సెంటర్ వద్ద గుర్తు తెలియని కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి శివారెడ్డి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు స్థానికలు ఆస్పత్రికి తరలించారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు



వనస్థలిపురంలోని గణేష్ దేవాలయం వద్ద...



హస్తినాపురం విశ్వేశ్వరాయ ఇంజనీర్స్ కాలనీలో..

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో రాత్రి వేళ వెలగాల్సిన వీధి దీపాలు పగలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. సూర్యోదయం కాగానే ఆర్పివేయాల్సిన వీధి దీపాలను ఎవరూ పట్టించుకోకపోవడంతో పలు కాలనీలలో పగలు వెలుగుతున్నాయి. దీంతో విలువైన విద్యుత్ దుబారా అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకుని పగలు వీధి దీపాలు వెలుగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4, 5వ తరగతులకు సంబంధించి (హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్) ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఎంపికలను జూలై 5వ తేదీ లోపు నిర్వహిస్తారని, ఎంపికైన బాల బాలికలు మాత్రమే జిల్లాస్థాయిలో పాల్గొనుటకు అర్హులని పేర్కొన్నారు. 14వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలు జిల్లాస్థాయిలో నిర్వహించే ఎంపిక ప్రక్రియలో పాల్గొంటారని, జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. మూడు దశలలో జరిగే ఎంపికలో 4, 5వ తరగతుల్లో 10 మంది చొప్పున బాల, బాలికలను ఎంపిక చేస్తామన్నారు. 4వ తరగతి కోసం 8 నుంచి 9 సంవత్సరాల మధ్య వయస్సు, 5వ తరగతికి 9 నుంచి 10 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, అదే విధంగా బర్త్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం, ప్రొగ్రెస్ కార్డ్, బోనఫైడ్, పాస్‌పోర్టోలు తీసుకుని రావాలని తెలిపారు.